క్లుప్తంగా

నాణ్యమైన రోడ్లపై విమర్శలు సిగ్గుచేటు



తాటిపర్తిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. ఆదివారం ఆయన తాటిపర్తి, పొన్నవోలు గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషితో గిరిజన శివారు గ్రామాలను అనుసంధానం చేస్తూ నాణ్యమైన రహదారులు నిర్మించారన్నారు. వీటి మీద ప్రయాణం చేస్తూ ప్రతిపక్షాలు విమర్శలు చేయడం శోచనీయమన్నారు. తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేశారన్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈర్లె అనురాధలను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు

- శిక్షణ తరగతుల నోడల్ అధికారి నాగలక్ష్మి



శిక్షణ తరగతులో మాట్లాడుతున్న నాగలక్ష్మి

మాడుగుల: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పీవో, ఏపీవోలు సిద్ధంగా ఉండాలని ఎన్నికల శిక్షణ తరగతుల జిల్లా నోడల్ అధికారి నాగలక్ష్మి తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లాపరిషత్ బాలుర హైస్కూల్‌లో పీవో, ఏపీవోలకు రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ఎన్నికల నియమావళి అనుసరించి అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి.సత్యవాణి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎన్నికల డీటీ ఎం.రాజా, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై శిక్షణ తరగతులు ప్రారంభం



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న సుసుమ్న కుమార్

మునగపాక: ప్రతి ఒక్కరూ భగవద్గీత పట్ల అవగాహన పెంచుకోవాలని ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం మేనేజింగ్ ట్రస్టీ సుసుమ్న కుమార్ కోరారు. మండలంలోని తోటాడలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీతపై శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. శిక్షణకు వచ్చిన వారిని మూడు బృందాలుగా విభజించి వారికి ఉచితంగా పుస్తకాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం 10 గంటలకు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఇటువంటి శిక్షణను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. తోటాడ,సిరసపల్లి, నారాయుడుపాలెం,గవర్ల అనకాపల్లికి చెందిన పలువురు శిక్షణకు హాజరయ్యారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



సమావేశమైన సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

రాంబిల్లి: ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని, తద్వారా పలు ప్రయోజనాలు పొందవచ్చని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి అప్పారావు అన్నారు. కొత్తపేటలో ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఆలయాల్లో సామూహిక హారతి, భజనలు తదితర కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో సమరసత సేవ ప్రతినిధులు నూకరాజు, గగన్ తదితరులు పాల్గొన్నారు.

డెవలప్‌మెంట్ వాచ్

ఆస్పత్రి.. అధునాతనం!



ఆధునికీకరణ తర్వాత కింతలి పీహెచ్‌సీ లోపలి భాగం



రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



చోడవరం సీహెచ్‌సీలో చిన్నపిల్లల సంరక్షణ కోసం ఐక్యూ యూనిట్

మాడుగుల రూరల్/బుచ్చెయ్యపేట/రోలుగుంట: గత టీడీపీ పాలనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు శిథిలావస్థకు చేరి అధ్వానంగా దర్శనమిచ్చేవి. చాలీచాలని వైద్య సిబ్బందితో అరకొర మందులతో సేవలందించేవి. నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో వాటి రూపురేఖలు మారిపోయాయి. నాడు – నేడు నిధులతో కార్పొరేటుకు దీటుగా అభివృద్ధి చెందాయి. చిన్నపాటి రోగానికి పట్టణ ప్రాంతాలకు పరుగులు తీయకుండానే గ్రామీణ స్థాయిలోనే నాణ్యమైన వైద్య సేవలందుతున్నాయి.

➡ మాడుగుల మండలం కె.జె.పురం పీహెచ్‌సీని నాడు – నేడు నుంచి రూ.51 లక్షలతో ఆధునికీకరించారు. ఇందులో ఆపరేషన్ థియేటర్, వైద్యుల గదులు, ప్రత్యేక డ్రగ్స్ స్టోర్‌తోపాటు ల్యాబ్, వార్డులు సుందరంగా తీర్చిదిద్దారు. దీని పరిధిలో 36 గ్రామాల్లోని 29,065 మంది జనాభాకు సేవలు అందుతున్నాయి.

➡ ఇదే మండలం కింతలి పీహెచ్‌సీని నాడు –నేడు నుంచి రూ.24 లక్షలతో ఆధునికీకరించారు. దీని పరిధిలో 43 గ్రామాల్లోని 26,440 మందికి వైద్య సేవలు అందిస్తున్నారు.

➡ రోలుగుంట పీహెచ్‌సీని రూ.80 లక్షలతో ఆధునికీకరించారు. దీని పరిధిలోని 16 పంచాయతీలకు చెందిన 20 వేల మంది జనాభాకు వైద్య సేవలందుతున్నాయి.

➡ బుచ్చెయ్యపేట మండలం తురలకలపూడిలో నాడు – నేడు నుంచి కోటి రూపాయలతో కొత్తగా పీహెచ్‌సీ భవనం నిర్మించారు. ఇక్కడ ప్రతి బుధ, శనివారాలు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు, ఇతర వైద్య సేవలు అందిస్తున్నారు.



బుచ్చెయ్యపేటలో నిర్మించి వెల్‌నెస సెంటర్



నాడు - నేడులో ఆధునికీకరించిన కె.జె.పురం పీహెచ్‌సీ

చంద్రబాబు మాటలు నమ్మి మోసపోకండి



వద్దాదిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఐయితంపూడిలో ప్రచారం చేస్తున్న సూర్య



దిబ్బిడిలో ఓటర్లతో మాట్లాడుతున్న రాంబాబు

బుచ్చెయ్యపేట: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మాటలు నమ్మి మరోసారి ప్రజలు మోసపోవద్దని జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, నియోజకవర్గ యువజన సంఘం అధ్యక్షుడు కరణం సూర్య కోరారు. చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడులకు మద్దతుగా ఆదివారం వీరు దిబ్బిడి, వద్దాది, ఐయితంపూడి గ్రామాల్లో వేర్వేరుగా ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. గతంలో డ్వాక్రా రుణాలు కట్టొద్దని, బంగారు నగలు విడిపించి ఇస్తామని, రైతు రుణ మాఫీ చేస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని, బాబు వస్తే ఇంటికొక జాబ్ ఇస్తామని మోసం చేశాడన్నారు. మొన్నటి వరకు వలంటీర్లు అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, ఆసరా నగదు పంచడం వల్ల రాష్ట్రం అప్పుల పాలై శ్రీలంకలా తయారవుతోందని దుష్ప్రచారం చేసిన చంద్రబాబునాయుడు ఇప్పుడు ఎన్నికల్లో ఎలాగైనా కుర్చీ ఎక్కాలని వైఎస్సార్‌సీపీ కంటే అధిక హామీలిచ్చాడని విమర్శించారు. మీకు మీ కుటుంబాలకు మేలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టి వారం రోజుల్లో జరిగే ఎన్నికల్లో టీడీపీకి ఓటుతో సమాధానం చెప్పాలన్నారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, మండల కన్వీనర్ కె.అప్పలనాయుడు, నాయకులు జోగా కొండబాబు, నమ్మి అప్పలరాజు, బోయిన నారాయణమూర్తి, పెదిరెడ్ల మాణిక్యం, ఐయితరెడ్డి నాయుడు, గొంపా చినబాబు, రామారావు, భూషణం పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు అండగా జగనన్న ప్రభుత్వం

నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ కుటుంబీకుల ఆత్మీయ సమావేశంలో ధర్మశ్రీ



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

రావికమతం: విశ్వబ్రాహ్మణులతోపాటు రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చారని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో విశ్వబ్రాహ్మణ కుటుంబీకులతో కొత్తకోటలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ఐదేళ్లలో జగనన్న కనీవినీ ఎరుగని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. మరింతగా సంక్షేమంపై దృష్టి పెట్టి మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. మళ్లీ ఆయనే సీఎం కానున్నారన్నారు. నియోజకవర్గంలో విశ్వబ్రాహ్మణులకు సంక్షేమ భవనం ఏర్పాటుకు కృషిచేస్తానని, ఎండిన కలపకు ఫారెస్ట్ అధికారులతో ఇబ్బందిలేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏటా రూ.కోటి కంటే తక్కువ వ్యాపారం జరిగే స్వర్ణకార షాపులకు పన్ను మినహాయింపు ఇస్తుందన్నారు. కుటుంబ సభ్యులందరూ ఐక్యత భావంతో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని తనకు సంపూర్ణ మద్దతు ఇచ్చి ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని కోరారు. ఆ సంఘం నియోజకవర్గ కన్వీనర్ గోపాసిన శ్రీను, రావికమతం, రోలుగుంట మండలాల కన్వీనర్లు వేమవరపు ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిక



బుచ్చెయ్యపేట కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: మండల కేంద్రం బుచ్చెయ్యపేటకు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన సుంకరి గణేష్, ఐయితరెడ్డి చిరంజీవి, డ్రైవర్ చిరంజీవి తదితరులు తమ కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి ఆదివారం ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో చేరారు. వీరందరికీ ఆయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగనన్న చేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని వారు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. కోఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జి సుంకరి శ్రీను, మాజీ సర్పంచ్ సుంకరి గాంధీ పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూములు పరిశీలించిన కలెక్టర్

నక్కపల్లి : నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఆదివారం పరిశీలించారు. ఈవీఎంలను ఈ స్ట్రాంగ్‌రూములో భద్రపరిచారు. నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ప్రత్యేక కౌంటర్లను కూడా పరిశీలించారు.

అడుగడుగునా బ్రహ్మరథం



కె.కోటపాడులో మహిళలతో మాట్లాడుతున్న అనురాధ

- కె.కోటపాడు, బత్తివానిపాలెం గ్రామాల్లో అనురాధ ఎన్నికల ప్రచారం



కె.కోటపాడులో అనురాధకు హారతులిచ్చి దీవెనలు అందిస్తున్న మహిళలు



బత్తివానిపాలెంలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తూ..

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ ఎన్నికల ప్రచారానికి అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కె.కోటపాడు, బత్తివానిపాలెం గ్రామాల్లో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రెండు గ్రామాల్లో పూలు జల్లుతూ మహిళలు హారతులిచ్చి అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ మంచి మనసుతో పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరలా రెండో పర్యాయం రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ప్రజలపైన ఉందన్నారు. ప్రజల చెంతకే పౌర సేవలను, పింఛన్‌దారుల వద్దకే ప్రతీ నెలా ఒకటో తేదీన పింఛన్ నగదును అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఐదేళ్ల కాలంలోనే మాడుగుల నియోజకవర్గాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వందల కోట్ల నిధులతో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారన్నారు. ఆయన స్ఫూర్తితోనే ప్రజలకు మరింత సేవ చేసే అవకాశాన్ని ప్రజలు ఓటుతో తనకు కల్పించాలని కోరారు. ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ కుటుంబ సభ్యుని వలే కష్టసుఖాల్లో తోడుంటానని భరోసా ఇచ్చారు. అనకాపల్లి ఎంపీగా బూడి ముత్యాలనాయుడుకు, ఎమ్మెల్యేగా తనకు రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అభివృద్ధి చేసే బాధ్యతను తనపై ఉంచాలని అనురాధ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఉప సర్పంచ్ రెడ్డి అరుణ, శ్రీకాంత్ శ్రీను, డోకల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం పూజలు



మోదమాంబ ఆలయంలో టెంకాయలు కొడుతున్న సర్పంచ్ సంజీవిరావు

మాడుగుల రూరల్: ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, ఈర్లె అనురాధ తాజా ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ ఆదివారం ఎం.కోడూరు మోదమాంబ ఆలయంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ప్రభావతి ఆధ్వర్యంలో 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపట్టాలని వేడుకున్నారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, మండల యూత్ విభాగం అధ్యక్షుడు కలిమి గోపాల్, నాయకులు పడాల అప్పలరాజు, చింతా మూర్తి, పడాల చిట్టిబాబు, పోతిన జగదీష్, ఖాతా వరలక్ష్మి, బోరా శ్రీను, గెంజి కృష్ణమూర్తి, శీరా అప్పలరాజు పాల్గొన్నారు. సోమవారం స్థానిక కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో 108 కొబ్బరి కాయలు కొట్టి రుద్రాభిషేకం నిర్వహిస్తామని పడాల అప్పలనాయుడు ఆదివారం తెలిపారు.

మోసపూరిత హామీలివ్వడంలో చంద్రబాబు ఘనుడు

- టీడీపీ మేనిఫెస్టోను ఎవ్వరూ నమ్మడం లేదు
- పలు గ్రామాల్లో కరణం ధర్మశ్రీ ఎన్నికల ప్రచారం



వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శీలం సుబ్బారావును పరామర్శిస్తున్న ధర్మశ్రీ

రావికమతం: ఆచరణ సాధ్యంకాని మోసపూరిత హామీలు ఇవ్వడంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఘనుడు అని వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ విమర్శించారు. తోటకూరపాలెం, తట్టబంద, గుడ్డిప, గొంప, పిల్లవానిపాలెం, మరుపాక, గర్నికం, టి.అర్జాపురం, కొట్నాబిల్లి, కిత్తంపేట, మేడివాడ, పి.పొన్నవోలు, ఆర్.కొత్తూరు, కొత్తకోట గ్రామాల్లో ఆదివారం ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ధర్మశ్రీకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో 99 శాతం హామీలను అమలు చేస్తే రాష్ట్రం శ్రీలంక, పాకిస్థాన్ మాదిరి దివాలా తీస్తుందని హేళన చేసిన చంద్రబాబు ఈ మారు మరో మోసపూరిత హామీలతో ఎన్నికలకు వచ్చాడన్నారు. రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌కుపైగా ఖర్చయ్యే మేనిఫెస్టోను తోడుదొంగలు చంద్రబాబు, పేకేజీ స్టార్ ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. వారి మోసపూరిత మేనిఫెస్టోను బీజేపీ అగ్రనేతలే నమ్మలేదని, కనీసం తాకడానికి ఇష్టపడలేదని గుర్తు చేశారు. పచ్చపత్రికల్లో వచ్చిన ఫుల్‌పేజీ యాడ్‌లో గెలిచిన వెంటనే నెలకు రూ.4 వేలు పింఛన్ ఇస్తానన్న హామీ మాయమైందని బాబు మోసాన్ని గ్రహించాలన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించే జగన్‌మోహనరెడ్డి ఆచరణ సాధ్యమైనవే హామీలిచ్చి ప్రజల విశ్వాశాన్ని పొందారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ మోహనరెడ్డి వస్తేనే ఈ పథకాలన్నీ కొనసాగుతాయన్నారు. వలంటీరుతో ఇంటింటికీ మళ్లీ పింఛన్ వస్తుందని మర్చిపోవద్దని, ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి మరోమారు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరిన కొత్తకోటకు చెందిన వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు శీలం సుబ్బారావును పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీపీ పైల రాజు, పార్టీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ ఆశరి వాసుగోవిందరావు, ఆయా గ్రామాల ముఖ్య నాయకులు కోనలోవరాజు, పందల దేవా, కుంచా సంకర్, పైల చినమ్మలు, పూడి దేవా, రుత్తల బాపునాయుడు, విరోది రాజారావు, పి.లక్ష్మి, ఎస్.చిరంజీవి, బి.సీతాదేవి, రమేష్‌నాయుడు, కేశంశెట్టి రాజు, పందూరి సత్తిబాబు, రావి గోవింద, కంట్రెడ్డి గోవింద, అడ్డూరి సత్యారావు, దుప్పట్ల బాలరాజు, రాజాన నర్సింహులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది

రోలుగుంట మండల ఉపాధ్యక్షుడు ఉలబాల రాము



బుచ్చింపేటలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు ఉలబాల రాము

రోలుగుంట: ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని, ఓటు అడిగే హక్కు తమ పార్టీకే ఉందని ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఉలబాల రాము అన్నారు. వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు గెలుపు కోరుతూ బుచ్చింపేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో వారి అనుయాయులకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసుకున్న పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పార్టీ, కులం, మతం అని చూడకుండా ప్రతి ఇంటికి సంక్షేమాలు అందించే పాలన సాగుతుందన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన జగనన్నకే సాధ్యమన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు వలంటీర్ల సేవలను కించపరచే వ్యాఖ్యలు చేయడంతోపాటు, ఫిర్యాదు చేయడంతో ఇంటింటా వారి సేవలు ఆగిపోయాయన్నారు. దాంతో పింఛన్ సొమ్ము ఈ నెల బ్యాంకులకు వెళ్లి తీసుకునే పరిస్థితి ఏర్పడడంతో అన్ని గ్రామాల వారు మండుటెండలో అష్టకష్టాలు పడుతున్నారన్నారు. వీటిని గమనించి ప్రతి ఓటరు తమ రెండు ఓట్లను ఫ్యాను గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

రెండు గ్రామాల్లో టీడీపీ ప్రచారం

రోలుగుంట, కొవ్వూరు గ్రామాల్లో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు పాల్గొని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఒక్క ఛాన్స్ అడిగారని, తనకు కూడా ఒక అవకాశమిచ్చి గెలిపించాలని ప్రజలను కోరారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



గంగవరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

గంగవరం: రానున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని భద్రత చర్యలు తీసుకున్నట్టు ఎస్ఐ బి.రామకృష్ణ అన్నారు. మండలంలోని గంగవరం, నెల్లిపూడి, పిడతమామిడి, మొల్లేరు గ్రామాల్లో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ భద్రతా సిబ్బంది కవాతు నిర్వహించారు. ఏఎస్ఐ రజాక్, పీసీలు వీరబాబు, శ్రీను, సీఆర్‌పీఎఫ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పరవాడ: గొర్లివానిపాలెం గ్రామ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఊపిరి ఆడక ఇబ్బంది పడుతున్న క్రమంలో అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు సీఐ ఎస్.బాల సూర్యారావు చెప్పారు. వివరాలు.. గొర్లివానిపాలెం వద్ద రోడ్డు పక్కన ఓ వ్యక్తి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు అతన్ని చికిత్స నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడని చెప్పారు. మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. మృత దేహాన్ని గుర్తించిన వారు 9440796038 నంబర్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



ఎస్ఈబీ దాడుల్లో పట్టుబడిన మద్యం

రంపచోడవరం: వై రామవరం మండల పరిధిలో బోడ్డుమామిడి గ్రామంలో ఎస్ఐ అబ్దుల్ అలీం ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించి ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ సీఐ ఎస్ ఇంద్రజిత్ తెలిపారు. ఈ దాడుల్లో 145 సీసాలు మద్యం, 24.5లీటర్ల బీర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ఒక వ్యక్తిని అదుపులో తీసుకున్నట్టు తెలిపారు.